మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 231
పేజీలు : 4

మంగళవారం 23 మార్చి, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## అర్ధరాత్రి వరకైనా పనిచేస్తాం..

- కోర్టుకు ఆర్థిక కార్యదర్శి రావలిసిందే
- హైకోర్టు ఆదేశాలు




**టి మీడియా, మార్చి 23 ,హైదరాబాద్ :**

రిటైర్డ్ ఉద్యోగులకువెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఏడాదిగా బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో ఆర్థిక కార్యదర్శిపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అర్ధరాత్రి వరకైనా కోర్టులోనే ఉంటాము . ఆర్థిక కార్యదర్శి వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేసింది.కోర్టు ఆదేశాలను దిక్కరించిన ఆర్థిక కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా సోమవారం వారి పిటిషన్‌కు విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారిస్తూ సోమవారం కోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆర్థిక కార్యదర్శికి ఆదేశించినప్పటికీ, కోర్టుకు రాకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు.అసెంబ్లీ సమావేశాల కారణంగా కోర్టుకు హాజరు కాలేకపోయారని ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని ముందే తెలుసు కదా. రాలేనని ముందే చెప్తే మినహాయింపు ఇచ్చేవాళ్ళం. కానీ ఎంత రాత్రయినా ఆర్థిక కార్యదర్శి కోర్టులో హాజరు కావాల్సిందేనని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

# తీర ప్రాంతాల వెంట మందుపాతర్లు

## అమెరికాకు ఇరాన్ మరో హెచ్చరిక

- ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్





**టి మీడియా, మార్చి 23 ,ఢిల్లీ బ్యూరో:**

అమెరికా భూతల దాడులకు సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ మరో తీవ్ర హెచ్చరిక చేసింది. అమెరికా భూతల దాడులకు సిద్ధమైతే మొత్తం పర్షియన్ గల్ఫ్‌లో నావల్ మైన్స్‌ను మోహరిస్తామని ఇరాన్ డిఫెన్స్ కౌన్సిల్ ఓ ప్రకటన జారీచేసింది. ఇరాన్ తీరాలను లేదా ద్వీపాలను శత్రువులు టార్గెట్ చేస్తే మిలిటరీ నిబంధనల మేరకు పర్షియన్ గల్ఫ్‌తోపాటు తీర ప్రాంతాల వెంట అన్ని మార్గాల్లో మందుపాతర్ల అమర్చాల్సి వస్తుందని పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని చెప్పింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్‌కు అమెరికా 48గంటల గడువు ఇచ్చింది. అందుకోసం కొన్ని ద్వీపాలను లేదా భూభాగాలను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా మెరైన్స్ రంగంలో దిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఈ మేరకు స్పందించింది. తాము కూడా భూతల దాడులు చేపట్టే అవకాశం ఉందని ఇజ్రాయెల్ తెలిపింది.

**అప్పటి సంగతి మర్చిపోకూడదు : ఇరాన్**

"ఇలా చేస్తే సుదీర్ఘకాలం గల్ఫ్ ప్రాంతమంతటా హర్మూజ్ జలసంధిలో నెలకొన్న పరిస్థితే ఉంటుంది. 1980ల్లో స్వల్ప సంఖ్యలో అమర్చిన సీమైన్స్‌ను తొలగించడానికి 100 మైన్ స్వీపర్లు ప్రయత్నించి విఫలమైన సంగతిని మర్చిపోకూడదు" అని ఇరాన్ తన ప్రకటనలో పేర్కొంది. తమ తీరం నుంచే వాటిని జలాల్లోకి ప్రవేశపెట్టగలమని వెల్లడించింది. ఫలితంగా గల్ఫ్ షిప్పింగ్ మార్గాలు, కమ్యూనికేషన్ లైన్లకు తీవ్ర అంతరాయం కలగొచ్చని అభిప్రాయపడుతున్నారు.

**పశ్చిమాసియాలోని విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తామని ఇరాన్ వార్నింగ్**

మరోవైపు హర్మూజ్ జలసంధిని తెరవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్? కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా సైనిక స్థావరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న పశ్చిమాసియాలోని విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తామని సోమవారం హెచ్చరించింది.

**జాబితా రిలీజ్ చేసిన ఇరాన్ వార్తా సంస్థలు**

అటు పశ్చిమాసియాలోని విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ఇరాన్ బెదిరించిన నేపథ్యంలో యూఏఈ అణు విద్యుత్ ప్లాంట్‌తో సహా ఇతర సౌకర్యాల జాబితాను అక్కడి వార్తా సంస్థలు ప్రచురించాయి. ఇరాన్? పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్‌కు సన్నిహితంగా ఉండే ఫార్స్ వార్తా సంస్థ ఈ జాబితాను ప్రచురించింది. పశ్చిమాసియాలోని డీశాలినేషన్ ప్లాంట్‌లతో సహా సౌదీ అరేబియాతో సరిహద్దుకు సమీపంలో పశ్చిమ ఎడారి ప్రాంతంలో నాలుగు రియాక్టర్లు, యూఏఈకి చెందిన బరాకా అణు విద్యుత్ ప్లాంట్ కూడా ఈ జాబితాలో ఉంది. దీంతో పాటు న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ వార్తా సంస్థ కూడా ఈ జాబితాను ప్రచురించింది.

**నీటి సరఫరాపైనా తీవ్ర ప్రభావం**

ఒకవేళ ఇరాన్ నిజంగానే గల్ఫ్, అరబ్ దేశాలపై దాడులు చేస్తే అక్కడి విద్యుత్, నీటి సరఫరాపై తీవ్రంగా ప్రభావితం పడుతుంది. ముఖ్యంగా ఎడారి దేశాలు తమ విద్యుత్ కేంద్రాలను, తాగునీటి సరఫరాకు కీలకమైన డీశాలినేషన్ ప్లాంట్‌లతో కలిపి నిర్వహిస్తున్న క్రమంలో ఇది మరింత ప్రమాదకరమని భావిస్తున్నారు.

**అమెరికాతో ఎప్పటికీ చర్చలు ఉండబోవని ఇరాన్ స్పష్టం**

అమెరికాతో ఎప్పటికీ చర్చలు ఉండబోవని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. సైనికచర్య ఉండదని హామీ ఇచ్చి అమెరికా మోసం చేసిందని మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. దౌత్యానికి అవకాశమే లేని విధంగా పరిస్థితులు మారిపోయినట్లు అబ్బాస్ చెప్పారు. 3 విడుతల చర్చల్లో పురోగతి సాధించినప్పటికీ ఎలాగైనా తమపై దాడి చేయాలని అమెరికా నిర్ణయం తీసుకుందని ఆయన ధ్వజమెత్తారు. అమెరికా విశ్వాసఘాతుకానికి పాల్పడిందన్నారు. పశ్చిమాసియా యుద్ధం దౌత్యమార్గం ద్వారాలను పూర్తిగా మూసివేసిందని అబ్బాస్ అగార్చీ చెప్పారు.

## రైతు రుణమాఫీ ప్రతిపాదన

- కేంద్రం పరిశీలనలో లేదు
- నిర్మలా సీతారామన్



**టి మీడియా, మార్చి 23 ,ఢిల్లీ బ్యూరో :**

రైతులకు పూర్తి రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో వెల్లడించారు. అయితే, రైతుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, వాటిలో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) ద్వారా సకాలంలో తగినంత రుణం అందించడం కూడా ఉందన్నారు. ఈ కేసీసీ కింద రూ.3 లక్షల వరకు పంట రుణాన్ని రాయితీ వడ్డీ రేట్లకు అందిస్తున్నామని తెలిపారు. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద సకాలంలో తిరిగి చెల్లిస్తే అదనపు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నామని గుర్తు చేశారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసిన ప్రాధాన్య రంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా, పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ.1.60 లక్షల నుంచి రూ. 2.00 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. అలాగే వ్యవసాయంతో సహా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని లోక్‌సభకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. వీటితోపాటు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని పేర్కొన్నారు.

## ఐదు రోజుల పాటు దాడులను వాయిదా



**టీ మీడియా, మార్చి 23, వాషింగ్టన్ :**

ఇరాన్ హెచ్చరికలతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఐదు రోజుల పాటు దాడులను వాయిదా వేశారు. ఇజ్రాయిల్ విద్యుత్ కేంద్రాలు, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలకు విద్యుత్ సరఫరా చేసే కేంద్రాలపై దాడులు చేపడతామని ఇరాన్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇతర ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయనున్నట్లు అమెరికా సోమవారం ప్రకటించింది. ఇరాన్‌తో దౌత్య చర్చలు మంచిగా, ఫలవంతంగా జరిగాయని, దీంతో ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇతర ఇంధన మౌలిక

మిగతా 3లో..

## బంగాల్‌లో ఐడెంటిటీ రాజకీయాలు

- ఫైటర్ దీదీగా మమత బెనర్జీ



**టీ మీడియా,మార్చి23, కోల్‌కత్తా:**

బంగాల్ రాజకీయాల్లో ఎన్నికల వేడి చాలా రోజుల క్రితమే మొదలైందని చెప్పాలి. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికే తన ప్రచార వ్యూహాలను తెరపైకి తెచ్చింది. ఫైటర్ దీదీ పేరుతో విడుదలైన యానిమేటెడ్ టీజర్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఆ టీజర్ ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కేవలం నాయకురాలిగా కాకుండా, బంగాల్ గుర్తింపును కాపాడే రక్షకురాలిగా చూపించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది.

**టీజర్‌లో రాజకీయ సందేశం**

సుమారు 16 నిమిషాల పాటు సాగిన ఆ యానిమేటెడ్ వీడియోలో విజువల్ స్టోరీ టెల్లింగ్‌కు పెద్దపీట వేశారు. ప్రారంభంలో బంగాల్‌పై మబ్బులు కమ్ముకున్నట్లు చూపిస్తూ, రాష్ట్రం ప్రమాదంలో ఉందన్న భావనను కలిగించేలా చిత్రీకరించారు. చివర్లో మమతా బెనర్జీ దృఢంగా నిలబడి, పోరాట యోధురాలిగా కనిపించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దుర్గాదేవి ప్రతిరూపం, రాయల్ బంగాల్ టైగర్ వంటి ప్రతీకలను ఉపయోగించడం ద్వారా భావోద్వేగాలకు హత్తుకునేలా టీజర్ రూపొందింది. ఇది కేవలం ఒక ప్రచార వీడియో కాదు, ఒక రాజకీయ సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం.

**బీజేపీపై పరోక్ష విమర్శలు**

టీజర్‌లో సాఫ్రాన్ జెండాతో కనిపించే శాడో ఫిగర్ ద్వారా బీజేపీపై పరోక్షంగా విమర్శలు చేశారు. "బెంగాల్‌ను వెలుపల శక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాయి" అనే నేరేటివ్‌ను బలంగా వినిపించారు. ఇది గత ఎన్నికల్లో కూడా టీఎంసీ విజయానికి కీలకంగా మారిన అంశం. ప్రత్యేకంగా వంటి అంశాలను సూచిస్తూ "బెంగాలీల గుర్తింపును లాక్కుంటున్నారు" అనే భావనను టీజర్‌లో చూపించడం గమనార్హం. బంగ్లాదేశీ అనే ముద్ర వేయడం వంటి సన్నివేశాలు ఈ సందేశాన్ని మరింత బలపరుస్తాయి.

**సాంస్కృతిక అంశాల వినియోగం**

బంగాల్ రాజకీయాల్లో సంస్కృతి ఎప్పుడూ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ టీజర్‌లో కూడా అదే ధోరణి కొనసాగింది. రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి ప్రముఖుల ప్రతిమలు ధ్వంసమవుతున్నట్లు చూపించడం ద్వారా, బెంగాల్ సంస్కృతిపై దాడి జరుగుతోందన్న భావనను కలిగించారు. ఇది బీజేపీపై సంస్కృతి గౌరవించదు అనే ఆరోపణలను పరోక్షంగా గుర్తు చేస్తుంది. దీంతో ప్రాంతీయ గర్వాన్ని రేకెత్తించడం లక్ష్యంగా కనిపిస్తోంది.

**బంగాల్ కూతురు X ఢిల్లీ అవుట్‌సైడర్స్**

టీఎంసీ వ్యూహంలో ప్రధాన అంశం బంగాల్ కూతురు జం ఢిల్లీ నుంచి వచ్చినవారు అనే విభజన. ఆ ఫార్ములా 2021 ఎన్నికల్లో భారీగా పనిచేసింది. అదే వ్యూహాన్ని 2026లో కూడా కొనసాగించాలని పార్టీ నిర్ణయించుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మమతా బెనర్జీని స్థానిక

మిగతా 4లో..

## బడ్జెట్‌లోవి అమలు చేయకపోవడం సిగ్గు చేటు

- మాజీ మంత్రి హరీశ్‌రావు




**టి మీడియా, మార్చి 23 ,హైదరాబాద్ :**

ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కోసం ప్రతిపాదించిన ప్రైవేట్ బిల్లు ప్రతిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభాపతికి అందించారు. ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టేందుకు వీలుగా శాసనసభ కార్యదర్శికి నోటీసు ఇచ్చారు. ఇందులో భాగంగానే ప్రైవేటు మెంబర్ బిల్లుకు సంబంధించిన నోటీసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్?కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్?తో పాటు ఇతర పార్టీ ఎమ్మెల్యేలు కలిసి అందజేశారు. ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు ద్వారా 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించే వీలు కలుగుతుందని కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశాల్లోనే అత్యంత కీలకమైన ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతించాలని స్పీకర్?కు కేటీఆర్ విజ్ఞప్తి

మిగతా 4లో..

# పశ్చిమాసియా ఉద్రికత్తలు

- ప్రపంచంలో ఎక్కడ సమస్య వచ్చినా భారత్‌పై ప్రభావం
- లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోదీ



**టి మీడియా, మార్చి 23 ,ఢిల్లీ బ్యూరో:**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆ సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై మాత్రమే కాకుండా ప్రజల జీవన విధానంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన అన్నారు. సోమవారం లోక్‌సభలో ఆ అంశంపై మాట్లాడిన ప్రధాని, పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని స్పష్టం చేశారు.అమెరికా--ఇజ్రాయెల్-- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించింది. దీని ప్రభావం భారత్‌పై కూడా పలు రంగాల్లో కనిపిస్తుందని మోదీ చెప్పారు. ముఖ్యంగా ఆర్థిక, భద్రతా, మానవతా కోణాల్లో సవాళ్లు ఎదురవుతున్నాయని వివరించారు. భారత్‌కు అవసరమైన ముడి చమురు, సహజ వాయువు (గ్యాస్)లో పెద్ద భాగం పశ్చిమాసియా దేశాల నుంచే వస్తుందని ప్రధాని గుర్తు చేశారు. ఆ ప్రాంతం ఇతర దేశాలతో వాణిజ్యానికి కీలక మార్గంగా కూడా పనిచేస్తుందని చెప్పారు. అందువల్ల అక్కడి పరిస్థితులు దిగుమతులు, ఎగుమతులు, సముద్ర మార్గ రవాణాపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు.


**దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నా**

హర్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు భారీ స్థాయిలో చమురు, గ్యాస్, ఎరువులు వంటి కీలక వస్తువులు రవాణా అవుతున్నాయని తెలిపారు. అయితే యుద్ధ పరిస్థితుల వల్ల ఆ మార్గంలో నౌకల రాకపోకలు కష్టతరంగా మారాయని అన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా అంతరాయం కలగకుండా చూసిందని మోదీ స్పష్టం చేశారు. దేశంలో ఎల్‌పీజీ వినియోగం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడి ఉందని ఆయన తెలిపారు. సుమారు 60 శాతం ఎల్‌పీజీ అవసరాలు దిగుమతుల ద్వారానే నెరవేరుతున్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ వినియోగదారులకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, అంతేకాకుండా దేశీయ ఉత్పత్తిని కూడా పెంచుతున్నామని వెల్లడించారు.పశ్చిమాసియాలో దాదాపు ఒక కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని ప్రధాని గుర్తు చేశారు. అలాగే వాణిజ్య నౌకల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయ సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులపై భారత్‌కు సహజంగానే ఎక్కువ ఆందోళన ఉంటుందని చెప్పారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అక్కడ ఉన్న భారతీయుల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని మోదీ తెలిపారు. ఇప్పటికే పశ్చిమాసియా దేశాల అధినేతలతో రెండు దఫాలుగా మాట్లాడినట్లు చెప్పారు. భారతీయుల భద్రతకు వారు హామీ ఇచ్చారని వెల్లడించారు.

**24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు**

సంక్షోభం సమయంలో ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని తెలిపారు. ఇరాన్ నుంచి మాత్రమే దాదాపు వెయ్యి మంది తిరిగి వచ్చినట్లు చెప్పారు. అందులో 700 మందికి పైగా వైద్య విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని మరణాలు, గాయాలు సంభవించాయని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయులకు 24 గంటల హెల్ప్‌లైన్లు, ఎమర్జెన్సీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గల్ఫ్ దేశాల్లో సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలను రద్దు చేసినట్లు మోదీ పేర్కొన్నారు. విద్యలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించిందని ప్రధాని వివరించారు. దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను గణనీయంగా పెంచినట్లు చెప్పారు. ప్రస్తుతం భారత్ వద్ద 5.3 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ నిల్వలు ఉన్నాయని, వాటిని 6.5 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.అదేవిధంగా గతంలో 27 దేశాల నుంచి మాత్రమే ఇంధనాన్ని దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు 41 దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటోందని మోదీ చెప్పారు. ఇది సరఫరా భద్రతను పెంచేందుకు తీసుకున్న ముఖ్యమైన నిర్ణయమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న క్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రధాని హెచ్చరించారు. కాబట్టి దేశం ఐక్యంగా ఉండి ఈ సవాళ్లను ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చూపిన ఐక్యతను మరోసారి ప్రదర్శించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు రూ. కోటి ప్రమాదబీమా చెక్కులు పంపిణీ



**టీ మీడియా,మార్చి23,హైదరాబాద్:**

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమృతుల కుటుంబాలకు అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి ఆయనను అభినందించారు.ఈ కార్యక్రమ భాగంగా, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులు ఓర్సు సురేశ్, ముఖ్తార్ బేగ్ కుటుంబాలకు ముఖ్యమంత్రి ఒక్కొక్కరికి రూ. 1 కోటి చొప్పున చెక్కులను అందజేశారు. విద్యుత్ రంగ ఉద్యోగులకు, సింగరేణి కార్మికులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలకు పైగా ప్రమాద బీమా రక్షణను విస్తరించింది. ఉద్యోగులు, వారి కుటుంబాలలో విశ్వాసాన్ని నింపడానికి, వారికి నైతిక మద్దతును అందించడానికి అసెంబ్లీ సమావేశాల సమయంలో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# నాడు శ్రీ లక్ష్మి వల్లభ... నేడు సాయి బాలాజీ

- రెన్యూవల్ నెలలోనే అగ్నిప్రమాదాలు
- రైతులకు అండగా డిప్యూటీ

**టి మీడియా, మార్చి 23, ఖమ్మం బ్యూరో:**


ఖమ్మం జిల్లా మధిరలోని కోల్డ్ స్టోరేజ్‌లలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదాలు అనేక అనుమానాలకు దారి తీస్తున్నాయి. ఇప్పటికే వీటిలో నిల్వ ఉన్న స్టాక్, బ్యాంక్ రుణాలు, పన్నుల చెల్లింపులపై ఆరోపణలు ఉన్నాయి.


2026 లో


2022 లో

2020 మే 20న మధిరలోని శ్రీ లక్ష్మి వల్లభ కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనకు 16 రోజుల ముందే (మే 4న) ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేయబడింది. అదే విధంగా, తాజాగా 2026 మార్చి 21న సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనకు 9 రోజుల ముందు (మార్చి 12న) ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేయడం గమనార్హం. ఈ రెండు ఘటనలు కూడా రాత్రివేళల్లోనే చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

అప్పుడు డిప్యూటీ స్పీకర్ హోదాలో, ఇప్పుడు డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న మల్లు భట్టి విక్రమార్క బాధిత రైతులకు అండగా నిలిచారు. ఏపీ సరిహద్దులో ఉండటం, అలాగే డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహించడం వల్ల మధిరకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, ఇక్కడి కోల్డ్ స్టోరేజ్‌ల నిర్వహణలో అనేక లోపాలు, ఆరోపణలు ఉన్నాయని తెలుస్తోంది. యాజమాన్యాలు రాజకీయ పలుకుబడి కలిగినవిగా ఉండటంతో స్థానిక మార్కెట్ అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.



శ్రీ లక్ష్మి వల్లభ (2012 లోని )ఇన్సూరెన్స్ రెన్యూవల్ పత్రాలు

గతంలో శ్రీ లక్ష్మి వల్లభ కోల్డ్ స్టోరేజ్‌లో రైతుల పేర్లపై వారి అనుమతి లేకుండా బ్యాంక్ రుణాలు తీసుకున్న ఘటన తీవ్ర చర్చకు దారి తీసింది. ఏపీ రాష్ట్రంలోని గుడివాడ బ్యాంకుల్లో నకిలీ పత్రాలతో బినామీ రుణాలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారం కొంతకాలం సంచలనం సృష్టించినప్పటికీ తరువాత సద్దుమణిగింది.

హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ సంస్థ షేర్లను కూడా మార్కెట్‌లో విడుదల చేసింది. అయినప్పటికీ, 14 ఏళ్లు గడిచినా కొంతమంది రైతులకు న్యాయం జరగలేదని బాధితులు వాపోతున్నారు.



సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ మార్చ్ 12 ,2026 న ఇన్సూరెన్స్ రెన్యువల్

2012 మే 20న జరిగిన అగ్నిప్రమాదంలో ఫైర్ సిబ్బంది గోడ కూలిపోవడంతో ఒకరు మరణించారు. జగ్గయ్యపేట, నందిగామ నుంచి ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చేందుకు మూడు రోజులు పట్టింది.

ఇక సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన తాజా అగ్నిప్రమాదం నేపథ్యంలో రైతుల పేర్లపై ఉన్న రుణాల వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. పూర్తి వివరాలు వెల్లడించడంలో అధికారుల నిర్లక్ష్యం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నాడు - నేడు అండగా భట్టి**

2012లో శ్రీ లక్ష్మి వల్లభ ఘటనలోనూ, 2026లో సాయి బాలాజీ ఘటనలోనూ మల్లు భట్టి విక్రమార్క స్వయంగా ఘటన స్థలానికి చేరుకుని అధికారులతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. బాధిత రైతులకు భరోసా ఇచ్చారు.





## ప్రగతి ప్రణాళికకి కనబడని కస్తూర్బా!!!

- ఆవరణ అంతా పిచ్చి చెట్లు

**టి మీడియా, మార్చి 23, ఖమ్మం రూరల్ :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ అనే కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అన్ని వ్యవస్థలలో అనేకరకాల సమస్యలను పరిష్కరించడమే కాకుండా విద్యా వైద్యంలో మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని పరిసర ప్రాంతాలను పరిశుభ్రపరచి జూన్ 2 నాటికి దేశంలోనే ఒక గొప్ప ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ ఈ కార్యక్రమం ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలంలోని ఎదలాపురం మున్సిపాలిటీలో కొన్ని పరిసర ప్రాంతాలను మరియు విద్యాలయాలను చూస్తే 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు ఇంకా కొన్ని పాఠశాలలు కనబడటలేదు అన్న దుస్థితి కనిపిస్తుంది.సీఎం రేవంత్ రెడ్డి మరియు సహ మంత్రులు అంత ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజా సమస్య లు పరిస్కారం లో భాగస్వాములు అవుతుంటే ఖమ్మం రూరల్ లోని ఎదులాపురం మున్సిపాలిటీ పరిది లోని కొన్ని పాఠశాలల్లో చుట్టూ పిచ్చి మొక్కల తో దోమలకి ఆవాసం గ మారిన అక్కడి వారికీ కనబడుటలేదు. అందుకు నిదర్శనం గ స్థానిక కస్తూర్బా పాఠశాల ఆవరణ కనిపిస్తుంది.

**కస్తూర్బా పాఠశాల ను పరిశీలిస్తే ...**

మున్సిపల్ కార్యాలయం కు కొద్దీ దూరం లో కస్తూర్బా గాంధీ పాఠశాల ఉండి వందల సంఖ్యలో పేదింటి విద్యార్థినలకు విద్యను అందిస్తున్న కస్తూరిబా పాఠశాల ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కల మరియు గడ్డి తో దోమలకి ఆవాసం మారీ విద్యార్థినల ఆరోగ్యని సవాలు చేస్తూన్న ప్రగతి ప్రణాళికకు కనబడుటలేదని విద్యార్థినీల తల్లిదండ్రులు చింతిస్తున్నారు, ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించి పాఠశాలలోని ఉన్న పిచ్చి మొక్కల ను గడ్డి నీ తొలగించాలని కోరుకుంటున్నారు.

## పాలెపు ఉమకు సీపీఎం నాయకుల నివాళులు

**టీ మీడియా, మార్చి 23, కొనిజర్ల:**



మండల పరిధిలోని తనికెళ్ల గ్రామం యాస అనంతరామయ్య నగర్ కాలనీకి చెందిన సీపీఎం నాయకురాలు బైరి మంగమ్మ పెద్ద కుమార్తె పాలెపు ఉమా అనారోగ్యంతో మరణించారు.ఆమె భౌతిక కాయానికి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మెరుగు సత్యనారాయణ నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, ఉమా కుటుంబ సభ్యులు మొదటి నుంచే పార్టీలో కొనసాగుతూ, పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆమె సేవలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మెరుగు రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్, పార్టీ మండల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, కూచిపూడి అప్పారావు, యాస వెంకటేశ్వర్లు, యాస తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధాల పునాదులపై రాజకీయ జీవితం

- మేఘారెడ్డికి సవాల్

**టీ మీడియా, మార్చి 23, వనపర్తి బ్యూరో:**



వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అబద్ధాల పునాదులపై రాజకీయ జీవితం ప్రారంభించారని నందిమల్ల అశోక్ తీవ్రంగా విమర్శించారు. మీరు రంగులు మార్చుకుంటూ పూటకో వేషం వేస్తున్న తీరు చూసి ఉసరివెల్లిలు కూడా సిగ్గుపడుతున్నాయని ఎద్దేవా చేశారు.మా నాయకుడిపై చేసిన ఆరోపణలను ఇప్పటికైనా రుజువు చేయాలని, లేకపోతే క్షమాపణ చెప్పడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. మాట తప్పినందుకు ముక్కు నేలకు రాసి వెంటనే రాజీనామా చేయాలని మేఘారెడ్డికి సవాల్ విసిరారు.ఇప్పటికైనా ఇచ్చిన హామీలకు కట్టుబడి సంత స్థలం సమస్యను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల్లో పోటీ పడాలని సూచించారు.

## నడిరోడ్డుపై ప్రమాదం

- మంటల్లో కాలిబూడిదైన ఎలక్ట్రిక్ స్కూటర్

**టీ మీడియా ,మార్చి 23 , గుడివాడ :**



రయ్‌మంటూ దూసుకెళ్తున్న ఎలక్ట్రిక్? బైక్?లో ఒక్కసారిలో మంటలు చెలరేగాయి. బైక్?పై వెనక కూర్చున్న మహిళ సమయస్ఫూర్తితో రెండు ప్రాణాలు దక్కాయి. అయితే నడిరోడ్డుపైనే వాహనం పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల భద్రతపై మరోసారి చర్చకు దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రయాణం మొదలైంది ఇలా**

కృష్ణా జిల్లా గుడివాడలో ఒక మహిళ తన ప్రయాణం కోసం ఆన్‌లైన్‌లో ఓలా ఎలక్ట్రిక్ బైక్ బుక్ చేసుకుంది. బుకింగ్ యాక్సెప్ట్ చేసిన డ్రైవర్ తన స్కూటర్‌తో ఆమె ఉన్న చోటికి వచ్చాడు. ఆ మహిళ వాహనం ఎక్కి కూర్చుంది. ప్రయాణం చాలా మామూలుగానే మొదలైంది. గమ్యస్థానం వైపు స్కూటర్ వేగంగా వెళ్తోంది. కొద్దిసేపటికి ఆ స్కూటర్ గుడివాడలోని రైల్వే పై వంతెన (ఫ్లైఓవర్) వద్దకు చేరుకుంది. ఆ సమయంలో అకస్మాత్తుగా వాతావరణం మారిపోయింది. ఏదో కాలిపోతున్నట్లుగా వాసన రావడం మొదలైంది. స్కూటర్ సీటు కింద నుంచి సన్నగా పొగలు రావడం ప్రారంభమైంది. వెనుక కూర్చున్న మహిళ వెంటనే దీనిని గమనించింది. దట్టమైన పొగను చూసి ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆమెకు అర్థమైంది.

**ప్రాణాలను కాపాడిన ఆ ఒక్క క్షణం**

పొగలు చూడగానే ఆ మహిళ ఏమాత్రం ఆలస్యం చేయలేదు. సమయస్ఫూర్తితో వ్యవహరించింది. వెంటనే స్కూటర్ ఆపాలని డ్రైవర్?కు చెప్పింది. సీటు కింద నుంచి పొగలు వస్తున్నాయని, మంటలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. వెనుక కూర్చున్న ప్రయాణికురాలి మాటలతో ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ కూడా వెంటనే అప్రమత్తమయ్యాడు. కంగారుగా వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపేశాడు. బండి ఆగీ ఆగకముందే ఇద్దరూ వెంటనే స్కూటర్ పైనుంచి కిందకు దిగేశారు. ప్రాణభయంతో ఆ వాహనానికి దూరంగా పరుగులు తీశారు.

**దగ్ధమైన వాహనం, ఎగసిపడిన మంటలు**

వారు కిందకు దిగిన కొన్ని క్షణాల్లోనే ఊహించని పరిణామం ఎదురైంది. స్కూటర్ నుంచి ఒక్కసారిగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ లేదా పేలుడు జరగడంతో మంటలు క్షణాల్లో వాహనం మొత్తాన్ని చుట్టుముట్టాయి. మంటల తీవ్రతకు అటుగా వెళ్లే వారంతా భయాందోళనలకు గురయ్యారు. చూస్తుండగానే ఆ ఓలా స్కూటర్ ఒక అగ్నిగుండంలా మారిపోయింది.

**రంగంలోకి అగ్నిమాపక సిబ్బంది**

నడిరోడ్డుపై ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ అలా కాలిపోతున్న దృశ్యాలను చూసి స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేసరికి జరగాల్సిన నష్టం పూర్తిగా జరిగిపోయింది. ఖరీదైన ఓలా స్కూటర్ పూర్తిగా కాలిపోయి బూడిదైంది.

**ఎలక్ట్రిక్ వాహనాల భద్రతపై ప్రశ్నలు**

ఆ మహిళ ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా చాలా పెద్ద ఘోరం జరిగి ఉండేది. ప్రయాణంలో గాలికి ఆ పొగను గుర్తించకపోయినా ఆ ఇద్దరూ మంటల్లో మంటల్లో చిక్కుకునే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. మహిళ చూపించిన సమయస్ఫూర్తిని అందరూ ఎంతగానో మెచ్చుకుంటున్నారు. అయితే, ఈ వరుస ఘటనలతో ఎలక్ట్రిక్ వాహనాల భద్రతపై మళ్లీ అనేక ఆందోళనలు మొదలయ్యాయి. వేసవి కాలం కావడం, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఈవీల బ్యాటరీలు పేలిపోతున్నాయన్న భయం వినియోగదారుల్లో తీవ్రంగా వ్యక్తమవుతోంది. కంపెనీలు భద్రతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



## మృతురాలి కుటుంబానికి మేఘన్న అభయ హస్తం

**టీ మీడియా ,మార్చి 23 ,పెబ్బేరు :**

సోమవారం మునిసిపాలిటీ పరిధిలోగల నాలుగవ వార్డులో నివాసం ఉంటున్న పున్నమ్మ అనే మహిళ అనారోగ్య కారణంగా మృతి చెందారు విషయం తెలుసుకున్న వి ఎస్ కె యూత్ సభ్యులు కౌన్సిలర్ దాసరి జమ్ములమ్మ కి విషయం తెలుపగా తక్షణ సహాయం కింద 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు .భాదిత కుటుంబానికి ఎల్లవేళలా మేము కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారుకార్యక్రమంలో శివకుమార్ ఐ వై సి జిల్లా సెక్రటరీ వీఎస్కే యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్ మాజీ డైరెక్టర్ రాములు దాసరి రాములు మోహన్ గౌడ్ హరిశంకర్ మహేష్ కృష్ణ పట్వారీ పద్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలకు కొత్త లైట్లు ఏర్పాటు

**టీ మీడియా, మార్చి 23, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట డబల్ బెడ్రూమ్ లకు వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభాలకు లైట్లు ఎగిరిపోవడంతో గత కొద్ది రోజులుగా చీకటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన డబల్ బెడ్రూమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వజ్రాల రమేష్ వెంటనే అధికారులకు తెలిపి కొత్త లైట్లు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీష్, సాయి,షు తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టారాజ్యంగా ఇటుక బట్టి వ్యాపారం జోరు

**టీ మీడియా, మార్చి 23, టేక్మాల్ ప్రతినిధి:**



ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఇటుక బట్టీల నిర్వహణ సాగుతోంది. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని టేక్మాల్ చౌరస్తా నుంచి మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల పరిసర ప్రాంతాల్లో, సార్మని కుంట--కుంటర గ్రామ పంచాయతీ రహదారి పక్కనే ఇటుక బట్టీలు ఏర్పాటయ్యాయి.ఈ ఇటుక బట్టీల నుంచి వెలువడుతున్న పొగ, దుమ్ము కారణంగా విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల కళ్లలో దుమ్ము చేరి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. నిత్యం ఆ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి, తమ ఇష్టారాజ్యంగా ఇటుక బట్టి వ్యాపారాన్ని నిర్వహిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం గమనార్హం.ఇటుక బట్టీల యజమానులు నిర్బంధాలు లేకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తుండగా, పరిస్థితి అదుపులో లేకుండా పోతుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇటుక బట్టీల యజమానులపై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యారంగానికి బడ్జెట్లో 20% నిధులు

- టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జి వెంకటేశ్వర్లు
- కలెక్టరేట్ ముందు నిరసన

**టీ మీడియా మార్చి 23,కామేపల్లి :**




విద్య రంగానికి రాష్ట్ర బడ్జెట్లో 20% నిధులు కేటాయించాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కామేపల్లి లో జరిగిన ఆ సంఘం మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్,పెండింగ్ బిల్లులు, డిఏ లు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సి పి ఎస్ ను రద్దు చేయాలని 2003 డిఎస్సీ టీచర్లకు వెంటనే పాత పెన్షన్ వర్తింప చేయాలని కోరారు. విద్య శాఖలో కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నగదురహిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ నిరసన ప్రదర్శనను యూనియన్ల కు అతీతంగా ఉపాధ్యాయులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బోడ నాగు , కె దేవేందర్ మండల నాయకులు వి వెంకటేష్, డి వెంకటేశ్వర్లు, వి కమల్ మోహన్ రావు, కె పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుకు తక్షణ స్పందన

- 20 ఏళ్ల సమస్యకు పరిష్కారం

**టి మీడియా, మార్చి 23 ,ఖమ్మం:**



తల్లాడ మండలం గోపాలపేట రాయల రమేశ్-సులోచన దంపతులు 20 ఏళ్లుగా ఖమ్మం నగరంలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారి 18 ఏళ్ల కుమారుడు అజయ్ మెదడు ఎదుగుదల లోపంతో మంచానికి పరిమితం అయ్యాడు.

**అధికారుల పరిశీలన**

ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తును అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కుటుంబం నిజంగా ఇబ్బందుల్లో ఉందని గుర్తించారు.

**తక్షణ ఉపశమనం**

ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అల్లిపురం డబుల్ బెడ్ రూం సముదాయంలో బ్లాక్ నెంబర్ 5, +7 లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించారు. ఈ ఇల్లు రమేష్-సులోచన దంపతులకు సోమవారం అందజేయబడింది.

**స్థానికుల అభిప్రాయం**

జిల్లా పరిపాలన తక్షణ చర్యతో ఆ కుటుంబానికి నూతన ఆశ కలిగిందని స్థానికులు అన్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం చూపిస్తున్న చొరవకు ప్రజలు అభినందనలు తెలిపారు.



## ప్రెస్ క్లబ్బా..? ప్రయివేటు క్లబ్బా..?

- అక్రమ వసూళ్లు- లెక్కలపై అనుమానాలు
- కలెక్టర్ తక్షణ విచారణ చేయాలి
- టిడబ్ల్యూజెఎఫ్ డిమాండ్

**టి మీడియా, మార్చి 23 ,ఖమ్మం:**

ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న వ్యవహారాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. జర్నలిస్టుల ఉమ్మడి వేదికగా ఉండాల్సిన ప్రెస్ క్లబ్‌ను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని 'ప్రైవేట్ క్లబ్'లా నడుపుతున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్-2843) జిల్లా కమిటీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణలు లోకల్ బాడీస్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సభ్యత్వాల పేరుతో రూ.1000 నుంచి రూ.3000 వరకు ఎటువంటి నిబంధనలు, రశీదులు లేకుండా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని నేతలు ఆరోపించారు. ఈ నిధులపై ఎటువంటి లెక్కలు, ఖాతాలు వెల్లడించకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. ఇప్పటివరకు క్లబ్ నిధులపై ఆడిట్ నిర్వహించలేదని, లెక్కలు అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ప్రెస్ క్లబ్ తాళాలు కూడా కొద్దిమంది వ్యక్తుల వద్దే ఉండటం, ఇతర జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరించడం, వాట్సాప్ గ్రూపుల్లో ఇతర యూనియన్ ప్రతినిధులకు అడ్మిన్ హక్కులు ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని టిడబ్ల్యూజెఎఫ్ నేతలు తెలిపారు. ఇటీవలి కాలంలో జర్నలిస్టులను అడ్డుకోవడం, బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం ప్రెస్ స్వేచ్ఛపై నేరుగా దాడి అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని ప్రెస్ క్లబ్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమ వసూళ్లపై ఆడిట్ నిర్వహించి లెక్కలు బహిర్గతం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ సమాన హక్కులు కల్పించాలని టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్-2843) నేతలు డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, నగర అధ్యక్షులు గెంటేల కుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, నాగకృష్ణ, శ్రీధర్, వెలిగొండ వెంకట్, రవి, మొగిలి నాగేశ్వర రావు, ఎం.ఎస్. చిన్ని, మామిడాల వీరబాబు, తానంగి భిక్షం, పాగ యోనా, తదితరులు పాల్గొన్నారు.

## భూదాన్ భూముల కేసులో మరో నలుగురు అరెస్ట్

**టి మీడియా, మార్చి 23 ,ఖమ్మం :**




అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల రెవెన్యూ ప్రాంతంలోని భూదాన్, ప్రభుత్వ భూములపై అక్రమ వ్యాపారాలకు, ఆక్రమణలకు పాల్పడిన వారి పై Cr. No. 101/2026, U/S 111 (1) (ii), 318(4) r/w 3(5) of BNS 2023 క్రింద గతంలో ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసులో మరో నలుగురు కీలక నిందుతులైన 1.కల్తీ రామచంద్రయ్య 2. బాణాల లక్ష్మణ చారి 3. చిప్పనపల్లి వీరయ్య 4. కుంజా కృష్ణయ్య ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఆయా కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అదేవిదంగా ఈ కేసు లో ప్రధాన నిందుతులైన 1) పోలెబోయిన ముత్తయ్య, 2)బల్లి శ్రీనివాస్, 3)కొప్పెర వెంకన్న, 4)కొట్టే బసు,5) సంపంగి వెంకటాచలం, లను మెజిస్ట్రేట్ అనుమతి తో పోలీస్ కస్టడీపై తీసుకొచ్చి విచారించిన అనంతరం సోమవారం తిరిగి జ్యుడీషియల్ రిమాండుకు తరలించడం జరిగిందని అన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు పదహారు (16) మంది నిందుతులను అరెస్ట్ చేయడం జరిగిందని, నిందుతుల అక్రమ అస్తులను గుర్తించి వాటిని చట్ట ప్రకారంగా స్వాధీనం పర్చుకొనుటకు ప్రక్రియ కొనసాగుతుందని ఏసీపీ తెలిపారు

## షాపులకు తాళాలు వేసిన మున్సిపల్ సిబ్బంది

**టీ మీడియా ,మార్చి 23, ఆత్మకూరు:**



వనపర్తి జిల్లా ఆత్మకూరు పురపాలక సంఘం నకు సంబంధించి ఆస్తి పన్ను చెల్లింపు యజమానుదారులు కొందరు బకాయిలు ఎక్కువగా ఉండటంతో సంబంధిత వార్డ్ ఆఫీసర్స్, బిల్ కలెక్టర్ లు పలు మార్లు ఆస్తి పన్ను చెల్లించాలని కోరగా కూడా చాలామంది చెల్లించడం లేదు. ఇక చూసేది లేక ఆర్థిక సంవత్సరశీ ముగుస్తుందని మునిసిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో బకాయి ఉన్న షాప్ లకు, ఇళ్లకు తాళాలు వేశారు దాదాపుగా 2018 నుండి బకాయి ఉన్న షాపులకు మున్సిపల్ సిబ్బంది అందరూ కలిసి కట్టుగా రంగం లోకి దిగి షాపులు తాళాలు వేసి యజమానులను హేచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఇ లు బాలాగోవింద్, డి. మధుబాబు వార్డ్ ఆఫీసర్స్ దయానంద్, బిల్ కలెక్టర్ లు శివకుమార్, ష్మ?కబౌల్ ఆశన్న, నరేందర్, రాజేందర్ లు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చడానికి ఈ మార్నింగ్ వాక్

**టీ మీడియా, మార్చి 23, ఆత్మకూరు :**



వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం రెండో వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు మార్నింగ్ వాక్ లో ప్రజల సమస్యల అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మెకానిక్ శ్రీనివాసులు, 2 వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో యువతులను అమ్మేసిన దంపతులు

**టి మీడియా, మార్చి 23 , ఆసిఫాబాద్ :**

అబ్బాయిల మాదిరిగానే అమ్మాయిలు కూడా ఇప్పుడు అన్నిరంగాల్లో ముందుంటున్నారు. మగ పిల్లల తరహాలోనే ఉద్యోగాలు చేస్తూ, తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నారు. చదువు పూర్తవ్వగానే ఉపాధి వెతుక్కుంటూ నగరాలు, పట్టణాల బాట పడుతున్నారు. ఉన్న ఊరు, కన్న తల్లిదండ్రులకు దూరంగా ఒంటరి జీవితం గడుపుతున్నారు. అయితే గ్రామాల నుంచి వచ్చే అమాయకపు ఆడ పిల్లలను మాయమాటలు చెప్పి మోసం చేసే ముఠాలతో జాగ్రత్తగా లేకుంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. అలా ఓ మోసకారి ముఠా చేతుల్లో పడిన ఇద్దరు యువతులకు ఓ నయవంచక ముఠా చేసిన ద్రోహం, ఉద్యోగం కోసం వెళ్లిన వారు ఎలాంటి ఉచ్చులో చిక్కుకున్నారో ఈ స్టోరీలో తెలుసుకుందాం.




**బంధువుల పెళ్లికి వెళ్దామని**

ఉపాధి కోసమని పల్లెటూరు నుంచి పట్టణానికి వచ్చిన యువతుల బిడియం, బెరుకు చూసి ఆ దంపతులు జాలిపడ్డారు. 'మీకు మేమున్నాం, భయమేమీ లేదు' అంటూ భరోసా కల్పించారు. వరసలు కలిపి పిలుస్తుంటే ఎంత ప్రేమ చూపిస్తున్నారోనని ఆ యువతులు మురిసిపోయారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు తీసుకెళ్తుంటే వారిలో బంధువుల్లా కలిసిపోయారు. కానీ వివాహానికి హాజరయ్యేందుకు మధ్యప్రదేశ్ వెళ్లిన ఆ యువతులు ఇక తిరిగి రాలేదు. బిడ్డలు పట్టణంలో పనికి పోతున్నారనుకుంటున్న తల్లిదండ్రులకు ఈ నిజం తెలియదు. పెళ్లికి వెళ్దామని యువతులతో చెప్పిన ఆ దంపతులు, మధ్యప్రదేశ్?లో వారిని ఆట వస్తువుల్లా విక్రయించిన ఘటన కుమురం భీం ఆసిఫాబాద్? జిల్లాలో చోటుచేసుకుంది.

**మంచి జీతంతో పాటు పెళ్లి కూడా**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలానికి చెందిన ఇద్దరు గ్రామీణ ప్రాంత యువతులు ఆరు నెలల కిందట ఉపాధి కోసం మంచిర్యాల వెళ్లారు. అక్కడ చెన్నూరు మండలం కిష్టంపేటకు చెందిన ముడిమడుగుల సవిత, ప్రశాంత్ దంపతులతో వారికి పరిచయం ఏర్పడింది. మాయమాటలతో యువతులకు ఆ దంపతులు బాగా దగ్గరయ్యారు. ఆ తర్వాత కొన్నాళ్లకు మహారాష్ట్రలోని సిరోంచ ప్రాంతానికి చెందిన మహేశ్ కూడా పరిచయమయ్యాడు. మంచి జీతంతో ఉద్యోగంతో పాటు పరిచయస్థులతో పెళ్లి కూడా చేయిస్తామని నమ్మించారు. దీంతో యువతులిద్దరూ భయపడి వద్దని చెప్పారు. అప్పుడే సవిత దంపతులు ఓ పథకం వేశారు.

**రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకుని**

తాము అనుకున్న లక్ష్యం నెరవేరేందుకు దంపతులు పక్కాగా ప్లాన్? వేశారు. యువతులతో 'బంధువుల పెళ్లి ఉంది, అందరం కలిసి వెళ్దాం' అంటూ సవిత ఆ యువతులిద్దరినీ కోరింది. నిజమేనని నమ్మిన వారు సరేనన్నారు. దీంతో వారిద్దరినీ పెళ్లిళ్లకు ఆడపిల్లల కొరత అధికంగా ఉన్న మధ్యప్రదేశ్‌లోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి అమ్మేశారు. అక్కడ మగ పెళ్లివారికి తాము వాళ్లిద్దరి మేనమామ, అత్త అని నమ్మించారు. దేవాలయాల్లో పెళ్లిళ్లు జరిపించి ఒక్కో యువతికి రూ.రెండున్నర లక్షల చొప్పున మొత్తం రూ.5 లక్షలు తీసుకుని యువతులను అక్కడే వదిలేసి వచ్చేశారు.

**తల్లిదండ్రులకు ఫోన్? చేయడంతో**

ఈ పెళ్లి తంతు గురించి ఆ యువతుల తల్లిదండ్రులకు తెలియదు. తమ బిడ్డలు ఇంకా పట్టణంలో ఉద్యోగం చేస్తున్నారేమోనని భ్రమలోనే ఉన్నారు. అయితే ఇటీవల ఆ ఇద్దరు యువతుల్లోని ఓ అమ్మాయి అక్కడి వారికి తెలియకుండా ఇంట్లో వాళ్లకు ఫోన్ చేసి అసలు విషయం చెప్పి ఏడ్వడంతో ఈ ఘటన బయటకు పొక్కింది. వెంటనే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి సవిత, ప్రశాంత్‌తో పాటు మహేశ్‌ను కూడా అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించారు. మరో నిందితుడు మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**ఉద్యోగాల ఎర వేసి**

కుమురం భీం జిల్లాలో ఏడాదిన్నర నుంచి ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. అమాయకపు గ్రామీణ ప్రాంత యువతులను నమ్మించి అమ్మాయిలు తక్కువగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో అమ్మేస్తున్నారు. ఇందుకోసం ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తీసుకెళ్లి, అక్కడ బలవంతంగా పెళ్లిళ్లు చేయిస్తున్నట్లు సమాచారం.

# పార్టీలో అవమానాలు భరించలేకపోతున్నా

- 30వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్త చట్టు మంగ ఆవేదన

**టి మీడియా, మార్చి 23 ,ఖమ్మం:**



పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న తనను మహిళగా గౌరవించకుండా కించపరుస్తున్నారని 30వ డివిజన్ మహిళా కాంగ్రెస్ కార్యకర్త చట్టు మంగ ఆవేదన వ్యక్తం చేశారు.

**మీడియా సమావేశంలో ఆరోపణలు**

ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డులో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె తనపై జరుగుతున్న వేధింపులను వివరించారు. ఈ నెల 21న జరిగిన బూత్ లెవల్ కమిటీ సమావేశంలో పార్టీకి చెందిన బొమ్మ ఉదయ్ తనను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు.

**"రాజకీయాల్లో నీకు పనేంటి?"**

"నీకు రాజకీయాలతో పనేంటి? ఇంట్లో ఉండి పిల్లలను చూసుకోవాలి కదా" అంటూ తనను అసభ్యంగా వ్యాఖ్యానించారని ఆమె తెలిపారు. ఇలాంటి సంఘటనలు ఇదే మొదటిసారి కాదని, గతంలోనూ నాలుగైదు సార్లు కించపరిచారని పేర్కొన్నారు.

**పెద్దలకు ఫిర్యాదు చేసినా మార్పు లేదు**

ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా, సంబంధిత వ్యక్తి ప్రవర్తనలో మార్పు రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**1997 నుంచి సేవలు**

"నేను కొత్తగా రాజకీయాల్లోకి రాలేదు. 1997 నుంచి గాంధీనగర్ ప్రాంతంలో పార్టీ బలోపేతం కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాను. తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నా పనితీరు తెలుసు. ఎప్పుడూ పదవుల కోసం ఆరాటపడలేదు" అని తెలిపారు.

**మహిళలకు గౌరవం ఎక్కడ?**

"రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంటే, క్షేత్రస్థాయిలో ఇలాంటి అణచివేత చర్యలు బాధాకరం" అని ఆమె అన్నారు.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

మహిళా కార్యకర్తలకు గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలని, తనను దూషించిన వ్యక్తిపై పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని చట్టు మంగ డిమాండ్ చేశారు.

## ములుగు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

**టీ మీడియా, మార్చి 23, ములుగు:**




ములుగు జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కలకలం రేపింది. కోర్టులో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఈమెయిల్ ద్వారా సమాచారం పంపారు. కోర్టులకు వరుసగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు జిల్లా కోర్టులకు ఇలాంటి బెదిరింపులు రావడంతో కలకలం రేగింది. సోమవారం ములుగు జిల్లా కోర్టుకు కూడా అలాంటి హెచ్చరిక వచ్చింది.బాంబు బెదిరింపు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈమెయిల్ అందిన వెంటనే చర్యలు ప్రారంభించారు. కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయించి, పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రతి మూలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.ఈ ఘటనతో కోర్టు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలి కాలంలో వరుసగా ఇలాంటి బెదిరింపులు రావంతో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.




## నామమాత్రంగా వార్డు సభ్యుల శిక్షణ తరగతులు

**టీ మీడియా, మార్చి 23, సింగరేణి (కారేపల్లి):**

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ తరగతులు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. మండలంలోని అప్పాయిగూడెం రైతు వేదికలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలకు సభ్యుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు.మండలంలోని 41 గ్రామపంచాయతీలకు చెందిన నూతనంగా ఎంపికైన వార్డు సభ్యులను మూడు గ్రూపులుగా విభజించారు. మొదటి విడతలో భాగంగా నిర్వహించిన శిక్షణకు హాజరు నిరాశాజనకంగా నమోదైంది. మొత్తం 116 మంది వార్డు సభ్యులు హాజరు కావాల్సి ఉండగా, అందులో సగానికి కూడా తక్కువ మంది మాత్రమే పాల్గొన్నారు.శిక్షణపై ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ, సభ్యులను సమర్థంగా సమీకరించడంలో అధికారుల సమన్వయం లోపించినట్లు తెలుస్తోంది. పర్యవేక్షణలో నిర్లక్ష్యం కారణంగా శిక్షణ తరగతులు నామమాత్రంగా మారినట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.ఐదు రోజుల శిక్షణకు కూడా సమయం కేటాయించని సభ్యులు, గ్రామ సమస్యల పరిష్కారంలో ఎంతవరకు చిత్తశుద్ధితో పనిచేస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని, వార్డు సభ్యులతో సమన్వయం పెంచి శిక్షణ తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## హామీల అమలు చేతకాక అరెస్టులా

**టీ మీడియా ,మార్చి 23 ,ఆత్మకూర్ :**



ఇచ్చిన హామీలు నెరవేర్చమంటే అక్రమ అరెస్టులా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత హామీలను గురించి ప్రశ్నిస్తే అర్ధరాత్రి అరెస్టులా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.సోయి తప్పి పేద ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీ ముట్టడి పెడితే దొంగల్లా అర్ధరాత్రి పోలీసులతో అరెస్ట్ చేయిస్తారా..??ఖబర్దార్. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఈ విధంగానే కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొంటామని జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు ముదిరాజ్, బీజేవైఎం నాయకుడు ఆనంద్, ఆత్మకూరు మండలం అధ్యక్షుడు అశోక్ భూపాల్, పట్టణ అధ్యక్షుడు సురేష్ పురపాలక సభ్యులు పుల్లారి భరత్, బిజెపి నాయకులు మెడికల్ నరేందర్, బాలకృష్ణ శ్యామ్ తదిత రులు పాల్గొన్నారు.

## సమారిటన్ ఫర్ ది నేషన్ ఆధ్వర్యంలో అంగన్వాడి భవనాలు

**టీ.మీడియా,మార్చి23,చింతూరు:**



ఆదివాసీ గ్రామాలలో, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా సమారిటన్స్ ఫర్ ది నేషన్ అనే స్వచ్ఛంద సంస్థ చింతూరు డివిజన్ లోని గ్రామాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంది. దానిలో భాగంగా, కుమ్మూరు గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా అంగన్వాడీ భవనం లేక పిల్లలు, అంగన్వాడీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందుకు పడుతున్నారని తెలుసుకుని, కుమ్మురు-2 సెంటర్ కు మరమ్మత్తులు, కుమ్మురు-1 సెంటర్ కు కొత్త భవనం నిర్మించి సోమవారం గ్రామస్థులకు అప్పగించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, సమారిటన్స్ సంస్థ ఫౌండర్ రామ్, ప్రోగ్రామ్ మేనేజర్ సంజయ్, పేగ పంచాయతీ సర్పంచ్ చంద్రయ్య పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానం

**టీ మీడియా, మార్చి 23, వనపర్తి బ్యూరో :**



దళిత ఉద్యమ నేత, ఉన్నత విద్యావంతుడు, చురుకైన నాయకుడు, దండోరా ఉద్యమంలో రెండు దశాబ్దాలకు పైగా పోరాటాలు చేసి ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో చురుకుగా పాల్గొన్నారు. నేడు కొల్ల వెంకటేష్ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించి వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించి నందుకు మాదిగ ఉద్యోగుల సంఘం దళిత సంఘాల నాయకులు బీసీ సంఘాల నాయకులు సోమవారం పాలిటెక్నిక్లలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దండోరా ఉద్యమ నేత గంధం గట్టయ్య మాదిగ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ రాష్ట్ర జేఏసీ కన్వీనర్ గంధము నాగరాజు,మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు తగవుల వెంకటస్వామి, తెలంగాణ జేఏసీ చైర్మన్ రాజారాం ప్రకాష్, మలి దేశ తెలంగాణ ఉద్యమ నాయకులు దేవన్న నాయుడు, దళిత నాయకులు శివశంకర్, పాత్రికేయులు దశరథం, హుస్సేన్, ఉద్యోగుల నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు,

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**టీ మీడియా మార్చి 23, ఖమ్మం:**




ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నడ్డి చందు తనకు లంగ్ క్యాన్సర్ వచ్చిందని, వైద్య చికిత్స నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. చిన్న వెంకయ్య సర్వే నెంబర్ 175/ఘ లో వారసత్వ భూమి 17 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 3 గుంటల భూమి కొందరు ఆక్రమించుకున్నారని, దీనిని విచారించి, వారసత్వ హక్కులను పరిశీలించి తమ భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తగుచర్యలు తీసుకోవాలని కామేపల్లి తహసీల్దార్ ను ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం గోపయిగూడెం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ తనకు వికలాంగుల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కే. వెంకన్న కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వీటిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.ఖమ్మం: ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ

జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరించారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన నడ్డి చందు తనకు లంగ్ క్యాన్సర్ వచ్చిందని, వైద్య చికిత్స నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంహెచ్ఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన డి. చిన్న వెంకయ్య సర్వే నెంబర్ 175/ఘ లో వారసత్వ భూమి 17 ఎకరాల 30 గుంటల భూమి ఉందని, అందులో 7 ఎకరాల 3 గుంటల భూమి కొందరు ఆక్రమించుకున్నారని, దీనిని విచారించి, వారసత్వ హక్కులను పరిశీలించి తమ భూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తగుచర్యలు తీసుకోవాలని కామేపల్లి తహసీల్దార్ ను ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం గోపయిగూడెం గ్రామానికి చెందిన షేక్ పెంటు సాహెబ్ తనకు వికలాంగుల ఫించన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరానికి చెందిన సామాజిక కార్యకర్త కే. వెంకన్న కొత్త బస్టాండ్ బైపాస్ రోడ్డులో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వీటిని తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడిని నడిపించేందుకు ఊరంతా ఏకమై

- లారీ అసోసియేషన్ బాసట

**టీ మీడియా ,మార్చి 23 ,కొణిజర్ల :**



కష్టం వస్తే కన్నీళ్లు తుడిచేవాడు కాదు, ఆ కష్టాన్ని తరిమికొట్టి కొండంత అండగా నిలిచేవాడే నిజమైన స్నేహితుడు అని నిరూపిస్తున్నారు ఈ ఊరి యువకులు. ఇటీవల జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో తన కాలును కోల్పోయి, మంచానికే పరిమితమైన తన మిత్రుడిని మళ్ళీ నడిపించేందుకు ఆ స్నేహితులంతా ఒక్కటయ్యారు. అయితే ఈ ప్రయత్నం కేవలం గ్రామానికే పరిమితం కాలేదు, అదే గ్రామానికి చెందిన లారీ అసోసియేషన్ వారు కూడా చేతులు కలపడంతో ఇది ఒక ఉద్యమంలా మారింది.ప్రమాదంలో కాలు కోల్పోయిన మిత్రుడు అయిన ముత్యాల భాస్కర్ (లేట్) పెద్ద కుమారుడు ముత్యాల అఖిల్. వయస్సు 22 సంవత్సరాలు వైద్య ఖర్చులు మరియు కృత్రిమ కాలు ఏర్పాటు కోసం లక్షలాది రూపాయలు అవసరమయ్యాయి. పేద కుటుంబం కావడంతో ఆ భారాన్ని స్నేహితులే భుజానికెత్తుకున్నారు. మా మిత్రుడిని మళ్ళీ నడిపిద్దాం అనే నినాదంతో కూడిన బ్యానర్‌తో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వారు చేసిన విజ్ఞప్తికి గ్రామస్థులు పెద్ద ఎత్తున స్పందించారు.యువకుల పట్టుదలను చూసిన అదే గ్రామానికి చెందిన లారీ అసోసియేషన్ సభ్యులు అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. కేవలం గ్రామంలోనే ఆగిపోవద్దని, అయోధ్య చేస్తున్న తపనను చూసి జిల్లా స్థాయి లారీ ఓనర్స్ అసోసియేషన్ మరియు తోటి డ్రైవర్లతో మాట్లాడి,ముత్యాల అఖిల్ కుటుంబం దీనస్థితిని వివరించి పెద్ద ఎత్తున నిధుల సేకరణకు శ్రీకారం చుట్టారు.తమ గ్రామానికి చెందిన బిడ్డ కోసం వారు పడుతున్న ఆరాటం చూసి జిల్లా లారీ ఓనర్స్ కూడా ఉదారంగా విరాళాలు అందజేశారు.ఒకటిగా కలిస్తే అసాధ్యమైనది ఏదీ లేదని ఈ సంఘటన నిరూపించింది. స్నేహితుల ఆవేదనకు, లారీ అసోసియేషన్ వారి కార్యాచరణ తోడవ్వడంతో మిత్రుడి వైద్యానికి సంబంధించి తమవంతుగా వీలైనంత సేకరించి అందిస్తున్నారు.వ్యక్తిగత స్వార్థం పెరిగిపోతున్న ఈ రోజుల్లో, ఒక ప్రాణం కోసం, ఒక జీవితం కోసం వీధిలోకి వచ్చి పోరాడుతున్న ఈ స్నేహ సైన్యాన్ని జిల్లా యంత్రాంగం మరియు సామాజిక కార్యకర్తలు వేనోళ్ల కొనియాడుతున్నారు.

## కారేపల్లిలో డివైఎఫ్ఐ కాగడాలతో ర్యాలీ

**టీ మీడియా,మార్చి23, సింగరేణి (కారేపల్లి):**



బ్రిటిష్ పాలకుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఊరికంబమెక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 84 వ వర్ధంతి సందర్భంగా కారేపల్లి లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన సోమవారం రాత్రి నిర్వహించారు. సినిమా హాల్ సెంటర్ నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అమెరికన్ సామ్రాజ్యవాద ఇజ్రాయిల్ యుద్ధం యుద్ధోన్మాదాన్ని నిరసించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు కే నరేంద్ర, మాజీ నాయకులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ నిత్యం యుద్ధాలకు, ప్రపంచంపై పెత్తనం కై, మార్కెట్ల విస్తరణకై, శ్రమ దోపిడీకి కారణం అవుతూ ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న సామ్రాజ్యవాదం అంతం తోటే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల ఆశయ సాధన సాధ్యం అని అన్నారు. ఈకార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదెర్ల వినయ్ కుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు వజ్జా రామారావు, ముండ్ల ఏకాంబరం, యువజన నాయకులు అన్నారపు కృష్ణ, పోడు భూముల సంఘం నాయకులు పాసిని నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు ఆదెర్ల గౌతం, లచ్చయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**టీ మీడియా,మార్చి23, సింగరేణి (కారేపల్లి):**



సింగరేణి మండల మాజీ జడ్పీటీసీ వాంకుడొత్ జగన్ నాయక్ సతీమణి జమున ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. ఆమెను వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ సోమవారం భాగ్యనగర్ తండాలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పాత కమలపురం సర్పంచ్ తేజావత్ బాబురావు ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన చీమ్నా తండాలో సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాత కమలాపురంకు చెందిన కట్ల భద్రమ్మ ఇటీవల మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ధరావత్ పాండ్య నాయక్, మాజీ మండల రైతుబంధు కన్వీనర్ గుగులోత్ శ్రీను, ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాంకుడొత్ నరేష్,టీడీపీ పాత కమలాపురం గ్రామ అధ్యక్షులు కొత్త తిరుపతయ్య, నాయకులు కాటన్నీ రామారావు, తోటకూరి తిరుపతయ్య, తోటకూరి వెంకటేశ్వర్లు, కొడిమళ్ల వెంకన్న కొర్ర నాగేశ్వరరావు, తేజావత్ కిషన్, సపావట్ కోటి, భూక్య నందు, భూక్య రవి, శ్రావణ్, రాజేష్, కోటి, దారావత్ వెంకట్, గిరిజన సంఘం నాయకులు భూక్య రాంకిషోర్ నాయక్, బానోత్ రాజేష్ నాయక్, ఎన్టీఆర్ సేవా సమితి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొత్త వెంకట్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో బోర్ల నిర్మాణానికి ఎంపీ నిధులు

**టీ మీడియా,మార్చి23, సింగరేణి (కారేపల్లి):**



సింగరేణి మండలానికి ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి నాలుగు బోర్వెల్ పంపులను మంజూరు చేసినట్లు జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాలలో తాగునీటి సమస్యను తీర్చేందుకు మాదారం,గుంపెల్లగూడెం, పేరుపల్లి, చిన్న మడెంపల్లి గ్రామపంచాయతీలలో బోరు పంపులు మంజూరు చేయాలని ఇటీవల ఎంపీ ని కోరినట్లు చెప్పారు.దీంతో స్పందించిన ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి నాలుగు చేతి పంపు బోరు బావులను నిర్మించేందుకు విధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు రూప్లా నాయక్, గుగులోత్ వీరబాబు, ఉమా, బానోతు పద్మ వీరభద్రంలు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ

**టీ మీడియా,మార్చి23, సింగరేణి (కారేపల్లి):**





గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు పరిపాలన అంశాలతో పాటు గ్రామాభివృద్ధి,ప్రభుత్వ పథకాలు, పంచాయతీ విధులు, నిధుల పై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం సింగరేణి(కారేపల్లి) మండలం అప్పాయిగూడెం రైతు వేదికలో నిర్వహించారు. శిక్షణ తరగతులకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులను మూడు గ్రూపులుగా విభజించి,ఒక్కో గ్రూపులో 116 మందికి పైగా చొప్పున వార్డు సభ్యులను చేర్చి మూడు విడతలుగా ఐదు రోజులు శిక్షణ ఇస్తున్నారు.మొదటి విడతలో భాగంగా సోమవారం నిర్వహించిన శిక్షణకు 116 మంది వార్డు సభ్యులు హాజరు కావాల్సి ఉండగా హాజరు శాతం తగ్గింది.

## చిన్నారికి ఆర్థిక సహాయం

- కౌన్సిలర్ నెల్లుట్ల నరేష్

**టీ మీడియా,మార్చి23, రాజన్న సిరిసిల్ల:**



సిరిసిల్ల 26 వార్డు లో నివాసం ఉంటున్న రెడ్డిమల్ల దయాకర్ -ప్రియాంక యొక్క చిన్న కూతురు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం వార్డు కౌన్సిలర్ భార్య నెల్లుట్ల లలిత తెలుపగ సమస్యను లలిత నెల్లుట్ల నరేష్ వివరించగా స్పందించి పాపా ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.10,000/-, 25 కేజీల రైస్ బ్యాగ్ వారి తండ్రి నెల్లుట్ల కనకయ్య చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నెలుట్ల కనకయ్య రవి వెంకటేష్ శ్రీకాంత్ వేణుగోపాల్ మునీర్ ముజీప్. బాలయ్య రవి రాజలింగం పరిషయ్య రాహుల్ నాగరాజు కమల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల పాటు దాడులను వాయిదా

(మొదటిపేజీ తరువాయి..)

సదుపాయాలపై దాడులను ఐదురోజుల పాటు వాయిదా వేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో చర్చలు ఈ వారం పాటు కొనసాగనున్నాయని ట్రంప్ తన సోషల్‌మీడియా 'ట్రూత్'లో పేర్కొన్నారు.

"మధ్యప్రాచ్యంలో మన మధ్య ఉన్న శతృత్వాలకు పూర్తి మరియు పరిష్కారంపై గత రెండు రోజులుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలు మరియు ఇరాన్ మధ్య చాలా మంచి ఫలవంతమైన చర్యలు జరిగాయని తెలియజేయడానికి నేను సంతోషిస్తున్నాను. లోతైన, విశ్లేషణాత్మక మరియు నిర్మాణాత్మక చర్యలు ఈ వారంలో కూడా కొనసాగుతాయి. కొనసాగుతున్న సమావేశాలు, చర్చలు విజయవంతం కానున్నందున, ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సాదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని నేను భద్రతా దళాన్ని ఆదేశించాను" అని పేర్కొన్నారు.

## బంగాల్‌లో ఐడెంటిటీ రాజకీయాలు

**(మొదటిపేజీ తరువాయి..)**

గౌరవానికి ప్రతీకగా చూపిస్తూ, బీజేపీని బయటి శక్తిగా చిత్రీకరించడం ద్వారా ఓటర్లలో భావోద్వేగాలను రేకెత్తించడమే లక్ష్యం.

**ముందస్తు ప్రచారానికి సంకేతం**

ఇప్పటికే టీఎంసీ 10 హామీలు ప్రకటించడం, 291 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం వంటి చర్యలు తీసుకుంది. ఇప్పుడు ఫైటర్ దీదీ టీజర్ విడుదలతో పార్టీ పూర్తిస్థాయి ఎన్నికల మోడ్‌లోకి వెళ్లిందని అర్థమవుతోంది. ఇది సాధారణ ప్రచారం కాదు, దీర్ఘకాలిక ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్న సంకేతం. క్యాడర్‌ను ఉత్తేజపరిచే ప్రయత్నంగా కూడా దీన్ని చూడొచ్చు.

**భావోద్వేగాలపై ఆధారపడిన పోటీ**

ఈసారి బంగాల్ ఎన్నికలు కేవలం అభివృద్ధి, సంక్షేమం వంటి అంశాలపైనే కాకుండా, ఐడెంటిటీ, సంస్కృతి, ప్రాంతీయ గర్వం వంటి భావోద్వేగ అంశాలపై కూడా సాగనున్నాయి. టీఎంసీ ఈ విషయాన్ని ముందుగానే గుర్తించి, తన ప్రచారాన్ని అదే దిశగా మలుస్తోంది. బీజేపీ కూడా తనదైన వ్యూహాలతో ముందుకు వస్తున్న నేపథ్యంలో, పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారనుంది.

**రాజకీయ విశ్లేషణ**

ఫైటర్ దీదీ టీజర్ ఒక విషయం స్పష్టంగా చెబుతోంది. టీఎంసీ ఈ ఎన్నికలను సాధారణ రాజకీయ పోటీగా కాకుండా, బంగాల్ కోసం పోరాటంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తోంది. మమతా బెనర్జీని యోధురాలిగా ప్రొజెక్ట్ చేయడం ద్వారా, ఆమెపై నమ్మకాన్ని మరింత బలపరచడం లక్ష్యం. అదే సమయంలో ప్రత్యర్థులను బంగాల్‌కు ముప్పుగా చూపించడం ద్వారా ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తోంది.మొత్తానికి ఫైటర్ దీదీ టీజర్ 2026 బంగాల్ అసెంబ్లీ ఎన్నికల దిశను ముందుగానే సూచిస్తోంది. ఈసారి పోటీ కేవలం రాజకీయ పార్టీలు మధ్య కాకుండా, భావోద్వేగాలు, సంస్కృతి, ప్రాంతీయ గర్వం మధ్య జరుగనుంది. ఇక నుంచి బంగాల్ రాజకీయాల్లో ప్రచారం మరింత ఉధృతమవడం ఖాయం. ఈ టీజర్ ఒక ప్రారంభ సంకేతం మాత్రమే. అసలు రాజకీయ సంగ్రామం ఇప్పుడే మొదలైంది!

## బడ్జెట్‌లోవి అమలు చేయకపోవడం సిగ్గు చేటు

**(మొదటిపేజీ తరువాయి..)**

చేశారు. స్పీకర్?తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా బిల్లు తాలూకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్? ఎమ్మెల్యే హరీశ్?రావు శాసనసభలో మాట్లాడుతూ కాంగ్రెస్? ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు.

**బడ్జెట్?లో పెట్టినవి అమలు చేయకపోవడం సిగ్గుచేటు**

గతంలో బీఆర్ఎస్? ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్? కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్?రావు అన్నారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్?లో పెట్టారని దానిని రూ.12 వేలకు తగ్గించారని హరీశ్?రావు ఆరోపించారు.

**రాజీవ్ యువవికాసం ఎప్పుడు అమలు చేస్తారు**

రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని రెండు బడ్జెట్?లలో పెట్టారని, ఒక్కసారి కూడా ఇవ్వలేదన్నారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తారని గత బడ్జెట్?లో చెప్పారని, దాని గురించి ఈసారి ప్రస్తావనే లేదన్నారు. అశోక్?నగర్?లో ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులపై లాఠీఛార్జీ చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయంలో 1.65 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లుగా వివరించారు. తాము పెట్టిన బడ్జెట్ ఆధారంగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు.రాజీవ్? యువవికాసం ఎప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని హరీశ్?రావు డిమాండ్ చేశారు. మహిళలకు రూ.లక్ష కోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తామని రెండు బడ్జెట్?లలో చెప్పారని మూడో బడ్జెట్?కు వచ్చేసరికి వడ్డీ లేని అనే పదం తీసేసి రుణాలు అని మాత్రమే పెట్టారని ఆరోపించారు. 18 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పి రెండున్నరేళ్లలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం ఎందుకు తగ్గుతుందో చెప్పాలని హరీశ్?రావు ప్రభుత్వానికి సూటిప్రశ్న వేశారు. హైడ్రా, విధ్వంసకర ఆలోచనల వల్ల ఆదాయం తగ్గుతోందన్నారు. కేంద్రం నుంచి నిధులు తేవడంలోనూ కాంగ్రెస్? ప్రభుత్వం విఫలమైందని హరీశ్?రావు విమర్శించారు.

## తహసీల్దార్‌ను కలిసిన ఎంఐఎం అధ్యక్షుడు

**టీ మీడియా, మార్చి 23, పెబ్బేరు:**



పెబ్బేరు పట్టణంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల తహసీల్దార్ శ్రీ సత్యనారాయణ రెడ్డిని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పెబ్బేరు మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ఎం.డి. అఫ్రోజ్ మాట్లాడుతూ, ఎంఆర్వో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ జనరల్ సెక్రటరీ అమీర్, జాయింట్ సెక్రటరీ మస్తాన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



## మాగంటి గోపీనాథ్ కుటుంబంలో మరో విషాదం

**టీ మీడియా,మార్చి23, హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, దివంగత మగంటి గోపీనాథ్ కుమార్తెలు అక్షర నాగ్, శిశిర నార్సింగి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పై జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలకు గురై, ప్రస్తుతం కోలుకుంటున్నారు. పోలీసుల ప్రకారం, ఆ యువతి, ఆమె ఇద్దరు స్నేహితులు శంషాబాద్ విమానాశ్రయం నుండి గచ్చిబౌలి వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నార్సింగి మార్గంలో ప్రయాణిస్తుండగా వారి ఫార్చ్యూనర్ కారు టైర్ ఊడిపోవడంతో ముందు వెళ్తున్న ఒక డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురూ గాయపడగా, అక్షర, సిసిర స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని తక్షణమే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.శంషాబాద్ విమానాశ్రయంలో ఒకరిని దింపి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నార్సింగి పోలీసులు, ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. డీసీఎం, కారును క్రేన్ల సహాయంతో రోడ్డు పక్కకు తరలించారు. పోలీసులు ఆ ప్రమాదానికి అతివేగాన్ని కారణంగా పేర్కొన్నారు. ఈ ఘటనపై బీఎన్ఎస్ లోని సెక్షన్ 125 (ఏ) కింద ఒక కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# అన్నా-మీ అకౌంట్లోకి కొన్ని డబ్బులు పంపిస్తా

- **కాజేసిన సొమ్మును బదిలీ చేసేందుకు మ్యూల్ ఖాతాలు**

**టీ మీడియా మార్చి 23, హైదరాబాద్ బ్యూరో :**



'అన్నా. నాకు ఓ వ్యక్తి డబ్బు ఇవ్వాలి. దానిని చెల్లించకుండా చాలా రోజులుగా ఇబ్బంది పెడుతున్నాడు. ఇప్పుడేమో ఇస్తా అంటున్నాడు. అయితే బ్యాంకు ఖాతాకే బదిలీ చేస్తా అంటున్నాడు. ప్రస్తుతం నా అకౌంట్?లో లిమిట్? దాటిపోయింది. ఇప్పుడు పంపొద్దంటే, మళ్లీ దొరకడు. కొంచెం నీ బ్యాంక్? అకౌంట్? నంబర్? ఇస్తే అందులోకి ట్రాన్స్?ఫర్? చేయమని అతడికి చెబుతా. కావాలంటే నీకు కమీషన్? ఇస్తాను. ప్లీజ్? కాదనకు.' ఈ మాటలు వింటే ఎదుటి వ్యక్తి అవసరం తప్ప, ఏమైనా అనుమానం కలుగుతోందా? కానీ ఇది సైబర్? నేరగాళ్ల కొత్త తరహా పన్నాగం.ఇటీవలి అనేక ఉదంతాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. సైబర్? నేరస్థుల ముఠాలకు అవసరమైన మ్యూల్? ఖాతాలను కమీషన్? ఆశపెట్టి బ్యాంకు అకౌంట్లను వినియోగించుకుంటున్నారు. బ్యాంక్ అకౌంట్లను సమకూర్చుకోవడంలో ఇదే మొదటి మెట్టు అని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం సుమారు 5 వేల వరకు మ్యూల్? అకౌంట్లను దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఇంకా వెలుగులోకి రానివి భారీ సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో 782 లావాదేవీలతో ప్రమేయం : హైదరాబాద్? జూబ్లీహిల్స్? మర్కంటైల్? కో-ఆపరేటివ్? బ్యాంకులో వెలుగుచూసిన మ్యూల్? ఖాతాల కేసులో సైబరాబాద్ సైబర్? క్రైమ్? పోలీసుల దర్యాప్తులో లింకు బయటపడింది. దీంతో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణ సైబర్? సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్?బీ) గత నెల 25న ఆపరేషన్? క్రాక్?డౌన్?ను నిర్వహించింది. దీనిలో ఒకేసారి 16 జిల్లాల్లోని వివిధ బ్యాంకుల్లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో 1,888 అనుమానిత మ్యూల్? అకౌంట్ల కేవైసీలను పరిశీలించారు. దీంతో దేశవ్యాప్తంగా 9,431 సైబర్? నేరాలు, తెలంగాణలో 782 లావాదేవీలతో ప్రమేయమున్నట్లు తెలిసింది. హైదరాబాద్? సుల్తాన్?బజార్?లోని ఓ బ్యాంకు ఖాతాకు 496 సైబర్? నేరాల ఫిర్యాదులు రాగా, సూర్యాపేట జిల్లాలోని 4 బ్యాంకుల్లోని 298 ఖాతాలకు సైబర్? నేరాల లావాదేవీలతో సంబంధమున్నట్లు బహిర్గతమైంది.

**కాజేసిన సొమ్మును బదిలీ చేసేందుకు**

కంబోడియా, లావోస్?, మయాన్మార్? దేశాల్లోని ?నేరస్థులు ముఖ్యంగా డిజిటల్ అరెస్టు, నకిలీ ఫోన్? కాల్స్,? లింక్స్?ద్వారా నగదు కాజేసే తదితర మోసాలు చేస్తున్నారు. దీని ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాలోని సొమ్మును కాజేస్తున్నారు. అలా కాజేసిన సొమ్మును బదిలీ చేసేందుకు మ్యూల్ అకౌంట్లు అవసరమవుతున్నాయి. వాటి కోసం ఫేస్?బుక్?, వాట్సాప్?, టెలిగ్రాంల ద్వారా ప్రకటనలు ఇస్తున్నారు. దీని కోసం కొందరిని ఏజెంట్లుగా నియమించుకుంటున్నాయి. వీరు తమకు పరిచయమున్న వారిలో వ్యాపారం చేసి నష్టపోయిన వారిని, డబ్బు సంపాదనపై ఆశ, అవసరమున్న వారిని ఎంచుకుంటున్నారు. వారికి కమీషన్ ఇస్తామంటూ ఆశచూపుతున్నారు. ఈ రకంగా చిక్కిన వారితో సేవింగ్స్, కరెంట్?? ఖాతా (మ్యూల్?)లను తెరిపిస్తున్నారు. అనంతరం ఖాతాల క్రెడెన్షియల్స్?ను దశల వారీగా సైబర్? ముఠాలకు చేరవేస్తున్నారు.

**రూ.లక్ష వరకు కమీషన్?**

ఒక్కో మ్యూల్? అకౌంట్?కు రూ.లక్ష వరకు కమీషన్? ఇస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. సైబర్ నేరాల బాధితులు బ్యాంక్? అకౌంట్ల నుంచి తొలుత ఐదారు దశల వరకు మ్యూల్ ఖాతాల్లోనికే ట్రాన్స్?ఫర్? చేస్తున్నారు. ప్రధాన ఏజెంట్లు ఏటీఎం లేదా బ్యాంకు ఖాతాల నుంచి సొమ్మును విత్?డ్రా చేస్తున్నారు. వీటిని క్రిప్టో కరెన్సీలోకి మార్చి, ఫారిన్? మనీ ఎక్స్ఛేంజీల ద్వారా విదేశాలకు చేరవేస్తున్నారు.

## మండిపోతున్న హైదరాబాద్ మెట్రో ఛార్జీలు

- **ఢిల్లీ కన్నా ఎక్కువ**

**టి మీడియా, మార్చి 23 ,హైదరాబాద్:**



దేశ రాజధాని ప్రాంతంలో (ఎన్‌సీఆర్) మెట్రో చౌకగా ఉన్నప్పటికీ, హైదరాబాద్ మెట్రోలో ప్రయాణ ఛార్జీలు ఎక్కువగా ఉండటం ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఇటీవల మంత్రి కమిటీ తెలిపిన నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఛార్జీలను 20-30 శాతం పెంచిన తర్వాత రోజువారీ ప్రయాణికుల సంఖ్య 4.44 లక్షల నుండి 4.28 లక్షలకు పడిపోయింది.హైదరాబాద్లో కనీస ఛార్జీ ?11గా, 9 కి.మీ దాటి గరిష్ట ఛార్జీ ?69గా ఉంది. కొన్ని ప్రయాణికులు "ఇది భారంగా ఉంది" అని అభిప్రాయపడుతున్నారు. ప్రైవేట్ నిర్వహణ నుంచి తెలంగాణ ప్రభుత్వ కంట్రోల్కి వచ్చే తర్వాత, ఛార్జీలను సమంజసంగా సవరించే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు.

**దేశంలోని మెట్రో ఛార్జీల సరిపోలిక**

ఢిల్లీ: 11-64 (చౌకగా, ప్రయాణికుల ఆదరణ ఎక్కువ)

బెంగళూరు: 10-90 (రాజకీయ కారణాలతో కొంతకాలం అమలు నిలిపివేయబడింది)

చెన్నై: 10-50 (మధ్యస్థ)

కోల్‌కతా: 5-30 (అత్యంత చౌకగా)

**సారాంశం:**

హైదరాబాద్ మెట్రోలో విస్తరణ ఉన్నా, ఇతర పెద్ద నగరాలా చౌకత లేకపోవడం వల్ల ప్రయాణికుల సంఖ్య తగ్గింది. కొత్త పాలసీ మార్పులతో ప్రయాణికులకు ఊరట కలిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## డిస్పాచ్ లక్ష్యం ఛేదించిన కొత్తగూడెం ఏరియా

- **అధికారులు, ఉద్యోగులకు జీఎం అభినందనలు**

**టి మీడియా, మార్చి 23 ,రుద్రంపూర్ :**



కొత్తగూడెం ఏరియాలో ఆర్‌సిహెచ్‌పి ద్వారా జరిగిన బొగ్గు రవాణా నిర్ణయించిన లక్ష్యాన్ని గడువు కంటే ముందుగానే అధిగమించింది. నిర్దేశించిన 49.50 లక్షల టన్నుల డిస్పాచ్ లక్ష్యాన్ని అధిగమిస్తూ తేదీ 22.03.2026 నాటికి మొత్తం 50.15 లక్షల టన్నుల బొగ్గు డిస్పాచ్ చేయడం ద్వారా మార్చి 31 గడువు కంటే ముందుగానే లక్ష్యాన్ని సాధించింది. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు మాట్లాడుతూ.. ఈ విజయానికి కృషి చేసిన అధికారులు, ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సమిష్టి కృషి, సమన్వయం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్‌లో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ కే.ఎస్.ఎన్. రాజు, ఎస్.ఈ (ఈ అండ్ ఎం) అజ్మీరా శ్రీనివాస్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ,గ ట్టయ్య, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు కేసులో 18 నెలల జైలు శిక్ష

**టీ మీడియా,మార్చి23, మధిర :**

ఖమ్మం జిల్లా మధిర మండలం టీచర్స్ కాలనీ కి చెందిన ఎం.డి ముస్తఫాలి కి చెల్లని చెక్కు కేసులో 18 నెలల జైలు శిక్షతో పాటు పిర్యాదికి 14 లక్షల 50 వేల రూపాయలు నష్టపరిహారం క్రింద చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాది కారి ఏపూరి బిందు ప్రియ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన తూము వీరభద్రరావు వద్ద నిందితుడు తమ కుటుంబ అవసరాల నిమిత్తం ఫిర్యాది వద్ద నిందితుడు 21 ఆగష్టు 2018 నాడు 5 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీ నోట్ నిందితుడు ఫిర్యాదికి వ్రాయించి ఇచ్చినారు. మరల 17 సెప్టెంబర్ 2018న ఐదు లక్షలు తీసుకొని అదే రోజు ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. తరువాత ఫిర్యాది తన ఋణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా 3 సెప్టెంబర్ 2020 నాడు 14 లక్షల 50 వేల రూపాయలకు చెక్కు నిందితుడు ఫిర్యాదికి జారీ చేయగా అట్టి చెక్కు ను ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా నిందితుని ఖాతాలో సరిపడా నగదు లేనందున చెక్ తిరస్కరణకు గురి కాగా తరువాత ఫిర్యాది తన న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రేవేటు కేసు దాఖలు చేయగా కేసులోని సాక్షలను విచారించిన న్యాయాదికారి నెరం బుజువు కావడంతో పై విదంగా శిక్ష విదిస్తు తీర్పు చేప్పారు.

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- **జిల్లా కలెక్టర్ అంకిత్**

**టి మీడియా, మార్చి 23 ,చుంచుపల్లి :**





జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటల దిగుబడులను గణనీయంగా పెంచుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. సోమవారం రామవరం కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంట వ్యాధి నివారణకు సంబంధించి నిర్వహిస్తున్న జాతీయ ఉచిత టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించే గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం జెండా ఊపి టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కిసాన్ మేళా సందర్భంగా వ్యవసాయం, కృషి విజ్ఞాన కేంద్రం, పశు సంవర్ధక రంగాలకు సంబంధించిన వివిధ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి సమగ్రంగా పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల నిర్వహణ విధానాలు, వ్యవసాయ యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలు, నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు.రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ మరియు ఆధునిక పద్ధతులను అనుసరించడం అత్యవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులను రైతులు స్వీకరించి, ఆధునిక విధానాల ద్వారా ఖర్చులను తగ్గిస్తూ దిగుబడులను పెంచుకోవచ్చని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రవేత్తల సలహాలు, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట మార్పిడి విధానాలను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు పంటల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సంప్రదాయ వ్యవసాయంతో పాటు వాణిజ్య పంటల సాగు, మిశ్రమ పంటల విధానం, పశు సంవర్ధక రంగాన్ని అనుసంధానం చేసుకోవడం ద్వారా రైతుల ఆదాయం పెంపొందించుకోవచ్చని వివరించారు.

ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కిసాన్ మేళా నిర్వహించబడిందని, రైతులకు ఒకే వేదికపై ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మేళా ద్వారా రైతులు కొత్త పద్ధతులను నేర్చుకుని వాటిని తమ పొలాల్లో అమలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, శ్రీ ఇంక్లైన్ సర్పంచ్ ఈసం ప్రవల్లిక, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ భరత్, ఆత్మ చైర్మన్లు వీరభద్ర రావు, బుచ్చిబాబు, బోడా మంగీలాల్, శాస్త్రవేత్తలు, తాసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తక్షణమే సమస్యలు పరిష్కరించాలి'

- **జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు**

**టి మీడియా, మార్చి 23 , బూర్గంపహాడ్:**




సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 13వ వేతన ఒప్పందంలో పెండింగ్ అంశాలు పరిష్కరించాలని, 14వ వేతన ఒప్పంద ప్రక్రియను కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీతోనే జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐటీసీ గేటు వద్ద రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. బీఆర్‌టీయూ, ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ తదితర ట్రేడ్ యూనియన్ల నాయకులు ఈ రిలే నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీకి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్, కో కన్వీనర్లు పాటి సోమిరెడ్డి, సానికొమ్ము రామచంద్రారెడ్డి, బెల్లం నాగయ్య మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. న్యాయమైన కోర్కెలను యాజమాన్యం తీర్చేంత వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఐటీసీ పీఎస్పీడీ పేరుతో పంచ్‌కార్డు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు, ప్లాంటేషన్ కార్మికులకు ఇస్తున్న వేతనాలకు అదనంగా రోజుకు రూ.500 ఇస్తూ వేతన ఒప్పందంలో పెంచిన మొత్తం బేసిక్ లో కలపాలన్నారు.కాంట్రాక్టు కార్మికులకు మొత్తం వేతనంపై ఎలాంటి సీలింగ్ లేకుండా 20 శాతం బోనస్ ఇవ్వాలన్నారు. సీ-4ఎల్, బీ-1ఎల్ గ్రేడ్లు వెంటనే తీసివేయాలని, వీఆర్ఎస్ స్కీం అమలు చేసి ఫైనల్ సెటిల్‌మెంట్ పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ నియామకంలో సీనియారిటీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, స్కిల్ మాట్రిక్స్ ప్రతి ఏడాది అమలు చేయాలని, 26 డ్యూటీలు ఇచ్చి వీక్లీ ఆఫ్ కు కూడా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్షా శిబిరాన్ని బీఆర్‌టీయూ నుండి సానికొమ్ము శంకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, ఏఐటీయూసీ నుండి సింగనేని ప్రసాద్, బీఎంఎస్ నుండి బిజ్జం అశోక్ రెడ్డి, సీఐటీయు నుండి వెంకటేశ్వర్లు, ఐఎన్టీయూసీ నుండి యారం పిచ్చిరెడ్డి, గోనె రామారావులతో పాటు జిల్లా స్థాయి నాయకులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కాంట్రాక్టు కార్మిక సంఘ జేఏసీ నాయకులకు సంపూర్ణ మద్దతు తెలిపి వారి సమస్యలు పరిష్కరించేంతవరకు అండగా ఉంటామన్నారు. ఈ రిలేదీక్షా శిబిరంలో జేఏసీ మెంబర్లు వర్లగొండ వీరన్న, సింగారపు సతీష్, కదల వెంకటరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, మేకల శేషమ్మ, రామశెట్టి లక్ష్మి, వీరంరెడ్డి సీతారామిరెడ్డితో పాటు పెద్ద ఎత్తున కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



## సిరిసపల్లి డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా దీక్ష

**టీ మీడియా,మార్చి23, హుజురాబాద్:**

మునిసిపాలిటీల చెత్తను సేకరించి హుజురాబాద్ సమీపంలోని డంప్ యార్డుకు తరలించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనలు మొదలయ్యాయి. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం సిర్సపల్లి గ్రామస్థులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన దీక్షలు చేపట్టారు. డంప్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల తాముఅనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందనిస్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సిర్సపల్లి-కొత్తపల్లి సమీపంలో డంప్ యార్డు ఏర్పాటుచేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని, సిర్సపల్లి వాసులు డిమాండ్ చేశారు.డంప్యార్డు ప్రభావం పంటలపైకూడాతీవ్రంగాపడునుందని దీనివల్ల ఆహారం విషతుల్యంగామారే ప్రమాదం లేకపోలేదనిస్థానికులుఅంటున్నారు. కాలుష్యం కోరల్లో చిక్కుకునితాము ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనంసాగించాల్సిన దుస్థితి నెలకొంటుందని నిరసనల కారులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిబండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నంప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ ఈటల రాజేందర్, మండలి విప్ బల్మూరి వెంకట్, ఇంఛార్జి వొడితెల ప్రణవ్ బాబుల మద్దతు కూడగట్టుకుని ముందుకు సాగనున్నామన్నారు.నిరసన దీక్షా శిబిరంలో అఖిల పక్షం కో ఆర్డినేటర్ పల్కల ఈశ్వర్ రెడ్డి, సిర్సపల్లి సర్పంచ్ పోల్సాని రామారావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బండ శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాజపల్లి సర్పంచ్ కటుకూరి మల్లారెడ్డి, జయన్న ఫౌండేషన్ అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, న్యాయవాది ముక్కెర రాజు, ఎవల్లి కొండాల్ రెడ్డి, జనగామ రాజ్ కుమార్, విజయ్ కుమార్, వెంకట్రావు, వేమారెడ్డి, వెంకట్ రెడ్డి, కల్లెపు హన్మంత రావు, పద్మారెడ్డి, ఐలయ్య రుద్రారపు రాయచంద్రం, కామకోటి కిషన్ రావు, ఐలయ్య, రవిందర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కుదిరిన సీట్ల పంపకం

- **7 సీట్లు ఎక్కువ దక్కించుకున్న బీజేపీ**

**టీ మీడియా,మార్చి23,చెన్నై:**

తమిళనాడులో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం కుదిరింది. బీజేపీకి 27 సీట్లు ఇచ్చేందుకు ఏఐడీఎంకే అంగీకారం తెలిపింది. గత ఎన్నికల కంటే బీజేపీ ఏడు సీట్లు ఎక్కువగా దక్కించుకుంది. ఒప్పందంపై పీయూష్ గోయెల్, పళనిస్వామి సంతకాలు చేశారు. పీఎంకేకు 18, ఏఎంఎంకేకు 11 సీట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చెన్నైలో పీయూష్ గోయల్, నైనార్ నాగేంద్రన్, అన్బుమణి రామదాస్ టీటీవీ దినకరన్ సహా పలువురు ఎన్డీయే నాయకుల సమక్షంలో విలేకరులను ఉద్దేశించి మాట్లాడుతూ, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సీట్ల పంపకాల చర్చలు ఈ రోజే ముగుస్తాయని, తుది నిర్ణయం తీసుకున్న అనంతరం ఈ రాత్రికి వాటిని ప్రకటిస్తామని ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి తెలిపారు. ఎన్నికల అనంతరం ఏఐఏడీఎంకే స్పష్టమైన మెజారిటీని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని పళనిస్వామి పేర్కొన్నారు. తాను న్యూఢిల్లీకి జరిపిన పర్యటనల విషయంలో, డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రిఎం.కె. స్టాలిన్ వ్యాప్తి చేస్తున్న అపవాదులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్డీయే కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకాన్ని ఈ రాత్రిలోగా ఖరారు చేయగలమని ఆశిస్తున్నట్లు ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. నియోజకవర్గాల గుర్తింపు ప్రక్రియను ఆ తర్వాత ఉమ్మడిగా చేపడతామని స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి, తమిళనాడు బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ పీయూష్ గోయల్ మాట్లాడుతూ... "మేమందరం ఒకే కుటుంబంలా ఉన్నాము, విజయం సాధించడమే లక్ష్యంగా మేము ఎన్నికల్లో పోరాడుతాము. మాకు కేటాయించిన 27 స్థానాల పట్ల మేము ఎంతో సంతృప్తిగా ఉన్నాము. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ల తీరుతో విసిగిపోయి ఉన్నారు కాబట్టి, మేము ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించి క్లీన్ స్వీప్ చేస్తాము. వారు రాష్ట్ర సంస్కృతిని దెబ్బతీశారు. ఈ రాష్ట్రంలో ఎన్డీయే కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది." అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

